ఆడపడుచులకు ఆస్తిగా ఇళ్ల స్థలాలు

- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- దేవరపల్లిలో 1910, గుమ్మిలేరులో 1391 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



దేవరపల్లిలో మహిళకు ఇంటి స్థలం అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: 2023 ఆసరా సమావేశాల్లో ఆడపడుచులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ఆస్తిగా ఇంటి స్థలాలు అందజేసినట్టు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని పేదలందరికీ ఇళ్లు లేఅవుట్లలో పట్టాలు అందచేసిన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు అందజేస్తున్నామన్నారు. సోమవారం ఈ కార్యక్రమంలో భాగంగా రావులపాలెం మండలం దేవరపల్లిలో సుమారు 1910 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు వారికి సంప్రదాయబద్ధంగా ఆడపడుచులకు పసుపు, కుంకుమ, గాజులు, బ్లౌజ్ పీస్ ఇవన్నీ కలిపి ఇంటి స్థలాలు చూపించి అందజేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పేద కుటుంబానికి కూడా ఇంటి స్థలం ఇచ్చిన పాపాన పోలేదని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న మంచి పేరు చూసి ఓర్చుకోలేని టీడీపీ స్థలాల పంపిణీ ఆపాలని విశ్వప్రయత్నాలు చేసిందన్నారు. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో జగన్ మోహన్‌రెడ్డి పేదలకు ఇంటి స్థలాలు అందచేసి వారికి ఒక స్థిరాస్తిని ఏర్పాటు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకటనాగదేవి, సర్పంచులు తాడేపల్లి నాగమణి, దొమ్మేటి అర్జునరావు, అంబటి సుబ్బలక్ష్మి, మట్టా సత్యదేవి, కొక్కిరగెడ్డ లక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, మల్లిడి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మిచాంగ్ తుపాను బారిన పడి దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం నుంచి మంజూరైన సాయాన్ని సోమవారం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. దేవరపల్లిలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని పొడగట్లపల్లి, లక్ష్మిపోలవరం, గోపాలపురం, ముమ్మిడివరప్పాడు, వెదిరేశ్వరం గ్రామాలకు చెందిన 13 మందికి రూ.62 వేల సాయాన్ని లబ్ధిదారులకు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అందజేశారు.

గుమ్మిలేరులో 1391 ఇళ్ల పట్టాల పంపిణీ

ఆలమూరు: రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సొంతిల్లు కల నిజం చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టి దేశంలో మరెక్కడా లేని విధంగా వైఎస్సార్ జగనన్న కాలనీలు నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మిలేరులో మండలంలో 18 గ్రామాలకు సంబంధించి సోమవారం రికార్డు స్థాయిలో తుది విడత 1391 మందికి ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రసంగించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా నిరుపేద మహిళందరికీ మౌలిక వసతులతో కూడిన కాలనీల్లో ఇళ్లు నిర్మించేందుకు నియోజకవర్గంలో సుమారు 450 ఎకరాలను సేకరించి దాదాపు 17,658 మందికి ఇళ్ల పట్టాలను దశల వారీగా పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా మహిళలకు సంప్రదాయ రీతిలో పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలను తాంబూలంతో కలిపి ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అందజేశారు. నియోజకవర్గంలో ఎల్లప్పుడూ ఆడపడుచులందరికీ సోదరుడిగా ఉంటూ అందరి అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, నల్లి రాజు, జుత్తుక శ్రీనివాసు, ఆనె వెంకన్న, సుంకర కామరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జి.మేడపాడుకు చెందిన జమి ఏసు కృష్ణ, గంగాభవాని దంపతులు సోమవారం రూ.10 వేలు విరాళంగా అందించారు. దాత కుటుంబానికి ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, కొమ్ముల సూరిబాబు, ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మామిడికుదురు: నగరం మల్లాయిపాలెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెదపట్నం గ్రామానికి చెందిన రాయుడు దుర్గాప్రసాద్ (19) సోమవారం మృతి చెందాడని నగరం ఎస్సై పి.సురేష్ తెలిపారు. నగరం మల్లాయిపాలెం వద్ద ఆదివారం రాత్రి పల్సర్‌పై వస్తుండగా ఇటుకల లోడుతో వస్తున్న బొలెరో వాహనం అతడ్ని ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్‌ను మొదట రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారని ఎస్సై తెలిపారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ దుర్గాప్రసాద్ మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి శ్రీనివాసు ఫిర్యాదు మేరకు దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృష్ణవేణి



మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గ్రామ వార్డు సచివాయలం ఎంప్లాయిస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మామిడికుదురు గ్రామానికి చెందిన జేవీ కృష్ణవేణి ఎంపికయ్యారు. ఏపీ గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి నుంచి తనకు ఈ మేరకు ఆదేశాలు వచ్చాయని కృష్ణవేణి సోమవారం తెలిపారు. ఆమె ప్రస్తుతం అమలాపురం శ్రీరామనగర్ వార్డు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమింపబడిన కృష్ణవేణిని పలువురు అభినందించారు. ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి సామాజిక తనిఖీ ప్రజావేదికను సదరు అధికారులు నిర్వహించారు. సంక్షేమ మండలి ద్వారా 2018–19 ఆర్థిక సంవత్సరానికి గాను పెళ్లికానుక నిమిత్తం ఇద్దరికి గాను రూ.40,000, సహజమరణం నిమిత్తం ఒక్కరికి రూ.50,000, మెటర్నిటీ బెనిఫిట్ ద్వారా 30 మంది లబ్ధిదారులకు రూ.6,00,000 పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. అలాగే 2019–20 ఆర్థిక సంవత్సరానికి గాను మెటర్నిటీ బెనిఫిట్ ద్వారా ముగ్గురు లబ్ధిదారులకు రూ.60,000 పంపిణీ చేసినట్టు వారు తెలిపారు. వీటిపై తనిఖీ చేపట్టిన అనంతరం ప్రజావేదికపై అసిస్టెంట్ కమిషనర్ లేబర్ డిపార్ట్‌మెంట్ జి.కేశవరావు రివ్యూ చేశారు. ఎస్ఆర్పీ సీహెచ్ఎస్ సత్యనారాయణ, సామాజిక తనిఖీ డీఆర్పీలు శ్రీనివాసు, ధనుంజయ్, రవికిరణ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఏపీపీగా ఆనంద్



ఏపీపీ ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు

రాజోలు: ఉత్తమ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాజోలుకు చెందిన నల్లి ఆనంద్ అవార్డు అందుకోవడంపై సోమవారం రాజోలు బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల గుంటూరులో జరిగిన సదస్సులో అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ చేతుల మీదుగా ఆనంద్ అవార్డు అందుకున్నారు. రాజోలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కోట సుధాకర్, కొక్కెరగడ్డ శేషగిరిరావు, న్యాయవాదులు సత్తిరాజు స్వామి, బొంతు శ్రీను, ఎ.రఘురామ్ తదితరులు ఏపీపీ ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరాలు

మామిడికుదురు: ఈదరాడ, పెదపట్నంలంక గ్రామాల్లో వీరభద్రస్వామి సంబరాలు సోమవారం వైభవంగా జరిగాయి. చిత్ర విచిత్ర వేషధారణలు, మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పుల నిర్వహించిన ఊరేగింపులో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈదరాడలో మండెల వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, పెదపట్నంలంకలో పేకేటి చిన్ని ఆధ్వర్యంలో సంబరం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా గ్రామోత్సవం, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈదరాడలో భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పాశర్లపూడి ఉత్తర బాడవలో జరిగిన వీరభద్రస్వామి సంబరంలో 60 అడుగుల నిప్పుల గుండం తొక్కారు.

జగనన్నతోనే సుపరిపాలన

అంబాజీపేట: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకులు నేలపూడి స్టాలిన్‌బాబు అన్నారు. అంబాజీపేటలో ఇటీవల పార్టీలో చేరిన స్టాలిన్‌బాబును స్థానిక నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధికి ఆకర్షితుడినై పార్టీలో చేరానన్నారు. రాబోయే రోజులు పార్టీ విజయానికి అందరితో కలిసి సైనికుడిలా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీ సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంపీటీసీ వడలి కృష్ణమూర్తి, మైలా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు తహసీల్దార్‌గా అనిల్‌కుమార్



ఆలమూరు: మండల తహసీల్దార్‌గా డీవీఎస్ అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఎన్నికల బదిలీల్లో ఆత్రేయపురం మండలం నుంచి బదిలీపై ఆత్రేయపురం మండలానికి వచ్చారు. ఇప్పటి వరకూ తహసీల్దార్‌గా పనిచేసిన కె.గోపాలకృష్ణ బదిలీపై రాజోలుకు వెళ్లారు. నూతన తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు రెవెన్యూ అధికారులు అభినందనలు తెలిపారు.

సరస్వతీదేవి అనుగ్రహంతో పదికి పది రావాలి

అంబాజీపేట: ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషి, సరస్వతీ దేవి అనుగ్రహంతో పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సరస్వతీదేవి పూజను సోమవారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఈ పూజలను వైభవంగా జరిపారు. స్థానిక పాఠశాలలో ఉన్న సరస్వతీదేవి విగ్రహం ముందు పరీక్ష అట్టలు, పెన్నులను ఉంచి భక్తిశ్రద్ధలతో కొలిచారు. అర్చకుడు మర్ల శ్రీనివాస్‌శర్మ పర్యవేక్షణలో సరస్వతీదేవికి పూజలు నిర్వహించారు. తమ విద్యార్థులకు అత్యుత్తమ మార్కులు రావాలని ఉపాధ్యాయులంతా విద్యార్థులను దీవించారు. అనంతరం పెన్నులు, అట్టలను విద్యార్థులకు పంచారు.

నేడు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం

పి.గన్నవరం: మండలంలోని చాకలిపాలెం కళ్యాణ మండపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజా ప్రతినిధులు సమావేశానికి హాజరు కావాలని విప్పర్తి విజ్ఞప్తి చేశారు.

అపర భగీరథుడు కాటన్



సఖినేటిపల్లిలంకలో కాటన్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాపాక, గ్రామస్తులు

సఖినేటిపల్లి: అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం సఖినేటిపల్లిలంక గ్రామంలో వశిష్ట గోదావరి రేవు వద్ద ఏర్పాటు చేసిన కాటన్ మహనీయుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే రాపాక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ఉభయగోదావరి ఉమ్మడి జిల్లాలు సస్యశ్యామలంగా ఉండి, రెండు పంటలూ పండించుకోవడానికి కాటన్ మహనీయుడు కట్టిన బ్యారేజ్ కారణమని అన్నారు. అటువంటి మహనీయుడి విగ్రహాన్ని గ్రామస్తులు రేవు వద్ద ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఆయన చెప్పారు. రేపూరి ఏసు నరసింహ రాజా, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, పెదపాటి నాగలక్ష్మి, పార్టీ నాయకుడు కేఎస్ఎన్ రాజు, గ్రామస్తులు ముత్యాల నాని, చల్లా నాగరాజు, నడింపల్లి వెంకట సుబ్బరాజు, వాడపల్లి రాజబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేకే విమర్శలు

ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



రోడ్డు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: అర్హులందరికీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడం చూసి పచ్చనేతలు ఓర్వలేకపోతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆత్రేయపురంలో పర్యటించి ఎప్పటి నుంచో శిథిలమైన రోడ్డుకు రూ.13 లక్షలతో శంకుస్థాపన పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం పలు చర్చిల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో మత్స్యకారులు పువ్వులతో జగ్గిరెడ్డికి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి పూర్తి స్థాయిలో ప్రతి సంక్షేమ పథకం మునుపెన్నడూ లేని విధంగా అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, ఎంపీటీసీ సరేళ్ల ధనలక్ష్మి, వాడపల్లి దేవస్థానం కమిటీ సభ్యులు రొట్టే దావీద్, జిల్లా మత్స్యకార సంఘం మాజీ సభ్యులు నాతి స్వామి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం



అంబాజీపేట మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: రైతన్న సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ రైతు మరింత అభివృద్ధి చెందేందుకు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నూతన సమాచారాన్ని అందిస్తున్నామన్నారు. మార్కెట్ యార్డుల అభివృద్ధికి పాలకవర్గం ఎంతో కృషి చేయడం అభినందనీయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే అన్ని వర్గాల రైతులకు మార్కెట్ యార్డుల్లో ఉన్నత పదవులు కల్పించారన్నారు. రాబోయే రోజుల్లో మార్కెట్ కమిటీ అభివృద్ధికి, రైతుల సంక్షేమాభివృద్ధికి పాలక వర్గం మరింత కృషి చేయాలన్నారు. సమావేశంలో కార్యదర్శి ఐ.రమేష్, వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, పాలకవర్గ సభ్యులు కోట విజయరాజు, నేదునూరి పుష్పకుమారి, మయూరి భారతి, పినిపే శ్రీలక్ష్మి, దాసరి శ్రీనివాసరావు, అడపా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రూ.32 కోట్లతో ఐదు రోడ్ల ఆధునీకరణ



రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. రూ.32 కోట్లతో పి.గన్నవరం–అంబాజీపేట రోడ్డుతో పాటు ఐదు రోడ్ల ఆధునీకరణ పనులకు సోమవారం వారు భూమి పూజ చేశారు. సమావేశంలో వారు మాట్లాడుతూ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు. పి.గన్నవరం–అంబాజీపేట రోడ్డు ఆధునీకరణ పనుల్లో భాగంగా ముందుగా గాజులగుంట సెంటర్‌కు సమీపంలో డ్రెయిన్‌లోకి కుంగుతున్న రోడ్డుకు రిటైనింగ్ వాల్ నిర్మించనున్నారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, పితాని నర్సింహరావు, సాధనాల రమేష్, దాసరి కాశీ, కొక్కిరి రవికుమార్, సరెళ్ల అప్పారావు, అడ్డగళ్ల శ్రీను, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, ఆర్అండ్‌బీ జేఈ రాజేంద్ర పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



గోపాలపురంలో మహాశివరాత్రి ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: మండలంలోని పలివెలలో పురాణ ప్రసిద్ధి చెందిన ఉమా కొప్పేశ్వరస్వామి కల్యాణం, మహాశివ రాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దేవదాయ–ధర్మదాయ శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి క్షేత్రంలో ఈ నెల 6 నుంచి 11 వరకూ స్వామి కల్యాణం, మహాశివరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల పోస్టర్స్ ఆవిష్కరణ సోమవారం రావులపాలెం మండలం గోపాలపురంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి స్వగృహ ఆవరణలో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా 6 ఉదయం నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా ఆ రోజు రాత్రి 4.20 గంటలకు (తెల్లవారితే 7వ తేదీ తెల్లవారుజామున) ఉమా కొప్పేశ్వరుల కల్యాణం, 8న మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి స్వామివారి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 3.40 గంటలకు స్వామివారి రథోత్సవం జరుగుతాయని దేవస్థానం ఇన్‌చార్జ్ ఈఓ చైతన్య వివరించారు. ఈ ఉత్సవ పోస్టర్లను, ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివస్తారని, వారికి ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, దేవస్థానం కమిటీ చైర్మన్ దుర్గాలక్ష్మీనారాయణ, ధర్మసత్రం చైర్మన్ చప్పిడి సాయిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తులా సూరిబాబు, పలివెల పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ పానుగుపాటి సత్యనారాయణ, మాజీ ఇన్‌చార్జ్ కోసూరి సూరపరాజు, యువజన విభాగం సభ్యుడు బెజవాడ నారాయణరావు, మల్లవరపు అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం



కొత్తపేట జర్నలిస్టులు–అధికారుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

కొత్తపేట: సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ప్రధానమైందని ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, డీఎస్పీ కేవీ రమణ అన్నారు. మండలంలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన (అక్రిడిటేషన్) ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులతో ఏర్పడిన నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం, అభినందన, ప్రభుత్వ శాఖల అధికారులతో ఆత్మీయ కార్యక్రమం సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె.వాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీవో సత్యనారాయణ, డీఎస్పీ రమణ ముఖ్యఅతిథులుగా, ఎంపీపీ మార్గన గంగాధరరావు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఆర్డీవో, డీఎస్పీ మాట్లాడుతూ జర్నలిస్టులు అంటే ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి వంటివారన్నారు. సమాజంలో సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి, ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ఎంపీపీ గంగాధరరావు మాట్లాడుతూ వ్యక్తిగా సాధించలేనిది సంఘటితంగా సాధించుకోవచ్చన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మీడియాకు తెలియజేయవలసిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందన్నారు. మండల ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా వేగిరౌతు శ్రీను, ప్రధాన కార్యదర్శిగా మట్టపర్తి జితేంద్ర, కోశాధికారి త్రిఘాకోళ్లపు బాబి, ఉపాధ్యక్షులుగా గెద్దం సురేష్, నామాడి రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా చోడపనీడి ఏసు, కార్యవర్గ సభ్యులతో ఆర్డీవో సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు సహాయంపై సామాజిక తనిఖీ

మామిడికుదురు: భవన నిర్మాణ కార్మికులకు అందించిన ప్రసూతి సహాయం, పెళ్లి కానుక, ప్రమాద బీమాపై సోమవారం మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ సమావేశం జరిగింది. గోదావరి సహాయ కార్మిక కమిషనర్ కేశవరావు మాట్లాడుతూ 2018–19 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 34 మందికి ప్రసూతి సహాయం, తొమ్మిది మందికి పెళ్లి కానుక, ఒకరికి ప్రమాద బీమాగా రూ.8.40 లక్షల సాయం అందించామన్నారు. 2019–20లో తొమ్మిది మందికి మూడు పథకాల ద్వారా రూ.1.80 లక్షల సాయం అందించామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.వేణుగోపాలరెడ్డి, ఎస్ఆర్పీ సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ మండలి సమావేశం

రాజోలు: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి సమావేశం సోమవారం స్థానిక ఎంపీప కార్యాలయంలో జరిగింది. ఎంపీడీఓ ఎస్.బాలాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2018–19కి సంబంధించి 45 మంది లబ్ధిదారులకు, 2019–20 ఏడాదికి ఎనిమిది మందికి మంజూరైన లబ్ధిని అందజేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ నిధి ద్వారా పెళ్లి కానుక రూ.10 వేలు నుంచి రూ.20 వేలు, సహజ మరణానికి రూ.20 వేలు నుంచి రూ.50 వేల చొప్పున లబ్ధిదారులకు అందజేశారు. కార్మిక శాఖ ఏసీ జి.కేశవరావు, సత్యనారాయణ, ఈఓపీఆర్డీ జి.భీమారావు, డీఆర్పీ బీమానాయక్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

పొలాలు ఎండి పోతున్నాయని రైతుల నిరసన

మామిడికుదురు: సాగునీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయంటూ మాకనపాలెంలో రైతులు సోమవారం నిరసన తెలిపారు. 20 రోజుల నుంచి సాగునీరు అందడం లేదని తీవ్రంగా మండిపడ్డారు. సార్వా సాగు చేయలేదని, దాళ్వా మాత్రమే సాగు చేశామని చిరుపొట్ట దశలో సాగునీరు అందక పంట పొలాలు నెర్రలు తీశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకనపాలెంలోని సుమారు 60 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదన్నారు. నీరు లేక పంట కాలువ ఎండిపోయిందన్నారు. సాగునీటి సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా వారు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై వెంటనే అధికారులు స్పందించి, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

మలికిపురం సభను విజయవంతం చేయాలి

సఖినేటిపల్లి: రాజోలు నియోజకవర్గంలో అసైన్డ్ భూములను ఏవీఆర్ కంపెనీ నుంచి కాపాడుకుందాం అనే నినాదంతో ఈనెల 12న మలికిపురంలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని జిల్లా సీపీఐ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ కోరారు. సోమవారం అంతర్వేదికరలో సీపీఐ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ, ఆల్‌క్యాస్ట్ సొసైటీలకు చెందిన భూములను కాపాడుకోవాల్సి అవసరం ఉందని సమావేశం పిలుపు నిచ్చింది.

ముగిసిన తొలి వార్షిక బ్రహ్మోత్సవాలు

- వేలాది మంది భక్తుల రాక
- భక్తి పారవశ్యంతో పులకించిన చింతలూరు



చింతలూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి

ఆలమూరు: బ్రహ్మాండ నాయకుడికి తన కుమారుడైన బ్రహ్మదేవుడు తొలిసారిగా చేయించిన ఉత్సవంగా భావించే బ్రహ్మోత్సవాలు మండలంలోని చింతలూరులో సోమవారం ముగిశాయి. బ్రహ్మోత్సవాలు ఎక్కడ జరుగుతాయో అక్కడికి సకల దేవతలు విచ్చేసి వేంకటేశ్వర స్వామిని సేవించుకుంటారని భక్తుల విశ్వాసంగా పండితులు చెబుతారు. స్థానిక శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి తొలి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 29న ప్రారంభమై మార్చి నాలుగు వరకూ జరిగిన ఈ బ్రహ్మోత్సవాల్లో అంతటా ఆధ్యాత్మిక సంతరించుకుంది. ఈ బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి భక్తిశ్రద్ధలతో తిలకించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఐదు రోజుల పాటు సుమారు 30 వేల మందికి అన్న సమారాధన చేశారు. హరే శ్రీనివాస భక్త భజన బృందంతో పాటు 52 మంది భక్తులు గోవిందమాల ధరించి బ్రహ్మోత్సవాలకు విశేష సేవలను అందించారు. దాతల సహకారంతో ఆధ్యాత్మిక వేత్త అల్లం రాజు భరణి పర్యవేక్షణలో దాతల సహకారంతో నిర్వహించిన ఈ బ్రహ్మోత్సవాలకు విశేష ఆదరణ లభించింది. రెట్టించిన ఉత్సాహంలో వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలను నిర్వహించాలని గ్రామస్తులు చెబుతున్నారు.

కల్పవృక్ష ముత్యాల పందిరి వాహనంపై దేవతామూర్తులు

బ్రహ్మోత్సవాల చివరి రోజైన సోమవారం నాడు దేవతామూర్తులు కల్పవృక్ష ముత్యాల పందిరి వాహనంపై ఊరేగితూ భక్తులకు దర్శనమిచ్చాడు. దారి పొడవునా భక్తులు గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది. అనంతరం ఆలయ ఆవరణలో భక్తుల దర్శనార్థం కల్పవృక్ష ముత్యాల పందిరి వాహనాన్ని ఆవరణలో అందుబాటులో ఉంచారు. ఈసందర్భంగా వేద పండితులు మహాదాశ్వీరచనం అందజేసి బ్రహ్మోత్సవాలకు హాజరైన పండితులను ఘనంగా సత్కరించారు.

మన ఊరు-మన గ్రామం-మన బాధ్యత

రావులపాలెం: సీఎం జగన్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సహకారంతో మండలంలోని కొమరాజులంకలో పార్కు, సీసీ రోడ్లు, గ్రామ సచివాలయం, ఆర్బీకే, వెల్నెస్ సెంటర్ భవనాలు, సీసీ డ్రైన్లు, మెయిన్ రోడ్డు పనులు ఇలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామ రూపురేఖలు మార్చేశారని సర్పంచ్ కర్రి గోవిందకృష్ణారెడ్డి అన్నారు. గ్రామంలో ఎక్కడా చెత్త ఉండకూడదని మన గ్రామం, మన పరిశుభ్రత, మన బాధ్యత అనే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సోమవారం ప్రారంభించారు. అలాగే గ్రామంలో ఎవరైనా మరుగుదొడ్లు నిర్మించుకోకపోతే వారికి తను సొంతంగా సాయం చేస్తానని హామీ ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలను మభ్యపెట్టినా మార్చలేరు

కొత్తపేట: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు టీడీపీ నాయకులు మాయమాటలు చెప్పి మభ్యపెట్టాలని చూసినా వారిని మార్చలేరని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని పలివెల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మట్టపర్తి శ్రీనివాస్, పాటి కనకరాజు, వీరవల్లి త్రిమూర్తులు, దొమ్మేటి శ్రీనులకు టీడీపీ వారు బలవంతంగా వారి పార్టీ కండువాలు వేశారు. వారు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులను కలసి జరిగిన విషయాన్ని వివరించి, వారి ద్వారా ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. వారు మాట్లాడుతూ తాము ఎప్పటి నుంచో వైఎస్సార్ సీపీలో ఉన్నామన్నారు. అయినా తాము లొంగమని, ఎప్పటికీ మీతోనే ఉంటామని జగ్గిరెడ్డికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తులా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.